క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఆగస్టు 1న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీఎస్ ఎన్పీడీసీఎల్ హనుమకొండ డీఈ జీ.సాంబరెడ్డి తెలిపారు. గోపాల్‌పూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని టీవీ టవర్, అమరావతినగర్, టీఎన్జీవోస్ కాలనీ ఫేజ్ -2, ఎన్జీవోస్ కాలనీ ప్రాంతాల్లో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

కేఎంసీకి పార్థివ దేహం అప్పగింత

ఎంజీఎం: కాజీపేట మండలం కుమ్మరిగూడెం నివాసి అనుమాల నాగేశ్వర్‌రావు(65) అనారోగ్య సమస్యలతో సోమవారం మృతిచెందారు. కాగా, కుటుంబ సభ్యుల అనుమతి మేరకు మృతుడి పార్థివ దేహాన్ని నేత్ర, శరీర, అవయవ దాతల అసోసియేషన్ సభ్యులు కేఎంసీకి అప్పగించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు మల్లారెడ్డి, కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్‌దాస్, మల్లునూరి రమేష్, రాజమౌళి, శంకర్‌రావు, రాజేంద్రప్రసాద్, అనంతుల కేదారి పాల్గొన్నారు.

కేయూలో బాధ్యతల స్వీకరణ

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ బాటనీ విభాగం అధిపతిగా కాంట్రాక్టు అధ్యాపకుడు డాక్టర్ జీ.లక్ష్మారెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అలాగే, కాకతీయ యూనివర్సిటీ హాస్టళ్ల, మెస్‌ల అదనపు డైరెక్టర్‌గా హెచ్‌ఆర్‌ఎం కాంట్రాక్టు అధ్యాపకురాలు సుచరితాపాల్ బాధ్యతలు చేపట్టారు. కాగా, బాధ్యతలు స్వీకరించిన ఆ ఇరువురిని వేర్వేరుగా కాకతీయ యూనివర్సిటీ కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ శ్రీధర్‌కుమార్‌లోథ్, కార్యదర్శి ఆర్‌డీ.ప్రసాద్, బాధ్యులు గడ్డం కృష్ణ, చీకటి శ్రీనివాస్, బ్రహ్మయ్య, మంజుల, సంతోష్, శ్రీధర్‌రావు, చంద్రశేఖర్, సీహెచ్.రాజ్‌కుమార్ కలిసి అభినందించారు.

రిలే నిరాహార దీక్షల విరమణ



కేయూ క్యాంపస్: యూనివర్సిటీల కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులరైజేషన్ చేయాలని డిమాండ్ చేస్తూ ఐదు రోజులుగా కేయూ పరిపాలన భవనం ఎదుట నిర్వహిస్తున్న కాంట్రాక్టు మహిళా అధ్యాపకుల సమర రిలే నిరాహార దీక్షలను వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేష్ సోమవారం సాయంత్రం విరమింపజేశారు. వీసీ వెంట రిజిస్ట్రార్ ప్రొఫెసర్ శ్రీనివాస్‌రావు, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బన్న అయిలయ్య ఉన్నారు.

ఉద్యోగ విరమణ సహజం



హన్మకొండ: ప్రతీ ఉద్యోగికి విరమణ సహజమని టీఎస్ ఆర్టీసీ వరంగల్ రీజియన్ డిప్యూటీ ఆర్‌ఎం కృపాకర్ రెడ్డి అన్నారు. ఆర్టీసీలో కండక్టర్‌గా ఉద్యోగంలో చేరిన ఒగ్గు క్రిష్టపర్.. వరంగల్ రీజియన్ ఇంజనీరింగ్ విభాగంలో సివిల్ ఇంజనీర్‌గా అదనపు బాధ్యతలు నిర్వహిస్తూ సోమవారం విమరణ పొందగా వరంగల్ రీజియన్ కార్యాలయంలో ఆయనను పలువురు అభినందించారు.

పింఛన్ డబ్బుల నుంచి ఇంటి పన్ను వసూలు

హసన్‌పర్తి: ఇంటి పన్నుల పేరుతో ఆసరా పింఛన్ల డబ్బులో నుంచి కోత విధిస్తున్నారని లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఘటన హసన్‌పర్తి మండలం సీతంపేటలో సోమవారం చోటు చేసుకుంది. జూలై మాసానికి సంబంధించిన ఫించన్ డబ్బులకు వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట క్యూకట్టారు. ఈక్రమంలో సదరు పంచాయతీ కార్యదర్శి అక్కడికి చేరుకుని ఇంటి పన్నుల రికార్డును పరిశీలిస్తూ పింఛన్ సొమ్ము నుంచి ఇంటి పన్ను వసూలు చేశారు. ఈ విషయమై సర్పంచ్ శరత్ కుమార్‌ను వివరణ అడగగా, మొండి బకాయిలు ఉన్న పెన్షన్‌దారుల నుంచి మాత్రమే ఇంటి పన్ను వసూలు చేసినట్లు తెలిపారు.

పద్య నాటిక పోటీల్లో అవార్డులు



హన్మకొండ కల్చరల్: జాతీయ స్థాయి పద్య నాటక పోటీల్లో జిల్లాకు చెందిన పద్యనాటక కళాకారులు అవార్డులు అందుకున్నారు. ఆంధ్రప్రదేశ్ తిరుపతికి చెందిన అభినయ ఆర్ట్స్ 23వ వార్షికోత్సవం సందర్భంగా తిరుపతిలోని మహతి ఆడిటోరియంలో హనుమ అవార్డ్స్ -2023 జాతీయ స్థాయి పద్యనాటక పోటీలు నిర్వహించారు. ఆదివారం జరిగిన ముగింపు కార్యక్రమంలో సంస్థ నిర్వాహకుడు బీఎస్.రెడ్డి నుంచి ఉత్తమ హాస్యనటుడిగా విశారదుడు పాత్రధారి జూలూరి నాగరాజు, ఉత్తమ హాస్య నటిగా చిత్రలేఖ పాత్రధారిణి కుమారి శాలిని, ఉత్తమ ఆహార్యం బీ.వెంకటస్వామి అవార్డులు అందుకున్నారు.

క్రైస్తవులపై దాడులు ఆపాలి



కాశిబుగ్గ: శాంతి ర్యాలీ తీస్తున్న క్రైస్తవులు



ఎంజీఎం: ర్యాలీలో క్రైస్తవ సంఘాల నాయకులు



దేశాయిపేట: ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

కాశిబుగ్గ: మణిపూర్ రాష్ట్రంలో క్రైస్తవులు, చర్చిలపై జరుగుతున్న దాడులను వెంటనే ఆపాలని వరంగల్ క్రిస్టియన్ సొసైటీ చైర్మన్ సరిగొమ్ముల దీన్‌దయాల్, వరంగల్ పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు బిషప్ ఎస్.ప్రేమ్‌కుమార్ డిమాండ్ చేశారు. గొర్రెకుంట క్రాస్ రోడ్డులోని మన్నా చర్చి నుంచి హనుమకొండలోని వరంగల్ కలెక్టరేట్ వరకు సోమవారం శాంతి ర్యాలీ నిర్వహించి అదనపు కలెక్టర్ శ్రీవత్సకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ దాడులకు పాల్పడుతున్న వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. ర్యాలీలో సొసైటీ సభ్యులు పుల్లా జగ్జీవన్ బాబ్జీ, గంధం అరుణ్ జేమ్స్, సాల్మన్‌రాజు, గాబ్రియల్, పోలెపాక సీతయ్య, విల్సన్, సుమన్, యాకోబ్, ఆరోగ్యం, శ్యామ్‌కుమార్, పాస్టర్లు, క్రైస్తవులు పాల్గొన్నారు.

క్రిస్టియన్ల శాంతి ర్యాలీ

ఎంజీఎం: మణిపూర్‌లో జరుగుతున్న హింసాకాండపై కేంద్ర ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని వరంగల్ క్రిస్టియన్ ప్రతినిధులు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పోచమ్మమైదాన్ నుంచి ఎంజీఎం జంక్షన్ వరకు క్రిస్టియన్లు సోమవారం శాంతి ర్యాలీ నిర్వహించి కూడలిలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మణిపూర్‌లో ఓ జాతిపై విచక్షణ రహితంగా దాడులు జరుగుతున్న విధానం అత్యంత దారుణమని క్రిస్టియన్లు వాపోయారు. కార్యక్రమంలో వరంగల్ మిషనరీ దీన్‌దయాళ్ అరుణ్ జేమ్స్, రాజు, కిన్నెర రవి తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్ అల్లర్లపై కొవ్వొత్తుల ర్యాలీ

దేశాయిపేట: మణిపూర్ అల్లర్లపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, అమిత్ షా బాధ్యత వహించాలని, అమానుష ఘటన నిందితులను కఠినంగా శిక్షించాలని గ్రేటర్ వరంగల్ 3వ డివిజన్ పాస్టర్స్ ఫెలోషిప్ ప్రధాన కార్యదర్శి ఇసంపెల్లి సుదర్శన్ డిమాండ్ చేశారు. ఈమేరకు కొత్తపేట గ్రామంలో ఆదివారం రాత్రి కొవ్వొత్తులతో తెలుగు బాప్టిస్ట్ చర్చి, రోమన్ క్యాథలిక్ చర్చి, క్రీస్తు దర్శనం మందిరం వరకు శాంతి ర్యాలీ నిర్వహించారు. గ్రేటర్ వరంగల్ పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు జన్ను ఇర్మియా, పాస్టర్ విజయచందర్, రాజు, శ్రీనివాస్, సంజీవ, శ్రీనివాసులు, పాల్సన్ రాజు, రాజు, ప్రశాంత్, కుమారస్వామి, సుబ్బు పాల్గొన్నారు.

ముంపు బాధితులకు అండగా ఉందాం



మహిళను ఓదార్చుతున్న రాకేష్‌రెడ్డి



బియ్యం, దుప్పట్లు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు



బియ్యం పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

హన్మకొండ: వరదతో ముంపునకు గురై సర్వస్వం కోల్పోయిన ముంపు బాధితులకు ప్రతీ ఒక్కరు అండగా ఉండి ఆదుకోవాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఏనుగుల రాకేష్‌రెడ్డి పిలుపునిచ్చారు. హనుమకొండలోని కాకతీయ కాలనీ, వడ్డెర కాలనీ, ఇంజనీర్స్ కాలనీ, ఇందిరానగర్‌లో సోమవారం పర్యటించారు. ముంపు బాధితులను పరామర్శించి ఓదార్చారు. వారికి బియ్యం, పప్పుతో పాటు ఇతర నిత్యావసర వస్తువులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజలకు ఏమీ చేయదని విమర్శించారు. ఈక్రమంలో స్వచ్ఛంద సంస్థలు, దాతలు ముందుకు రావాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కస్తూరి నవీన్, ప్రవీణ్, శ్యామ్, తిరుపతి రెడ్డి, సతీష్‌రెడ్డి, గౌరీ శంకర్, రూప్‌సింగ్, భాస్కర్, రాజేష్, కళ్యాణ్ పాల్గొన్నారు.

బాధితులకు బియ్యం, దుప్పట్ల అందజేత

వరంగల్: ఇటీవల ముంపునకు గురైన బాధితులకు వరంగల్ తూర్పు నియోజకవర్గ బీజేపీ నాయకులు డాక్టర్ వన్నాల వెంకటరమణ ఆధ్వర్యంలో బియ్యం, దుప్పట్లను సోమవారం పంపిణీ చేశారు. నగరంలోని 12, 13వ డివిజన్లలోని ముంపు బాధితులకు వీఏకే ఫౌండేషన్ ఆధ్వర్యంలో సుమారు 70 కుటుంబాలకు ఏడు కిలోల చొప్పున బియ్యంతో పాటు రాష్ట్ర పార్టీ తరఫున వచ్చిన దుప్పట్లను అందజేశారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్, నాయకులు వెంకటేశ్వర్లు, సుబ్రమణ్యం, అపురూప రజనీష్ నేత, హనుమాన్ శర్మ పాల్గొన్నారు.

12వ డివిజన్‌లో బియ్యం పంపిణీ

దేశాయిపేట: ఇటీవల వరదల కారణంగా ఇబ్బందులు ఎదుర్కొన్న 12వ డివిజన్‌లోని చేనేత కార్మికులకు కాంగ్రెస్ నాయకులు కొండా సురేఖ, మురళి దంపతుల ఆదేశాలతో బియ్యం పంపిణీ చేసినట్లు వరంగల్ సిటీ మహిళా పార్టీ అధ్యక్షురాలు నారగోని స్వప్నగౌడ్, టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాశ్ అన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు చిలుక శ్రీధర్, నాయకులు దాసరి రాజేష్, బత్తుల వినోద్, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

హన్మకొండ అర్బన్: అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) జిల్లా అధ్యక్షుడు ఆముదాల దాత మహర్షి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 'ఉపాధ్యాయ ఉద్యమ జాగరణ' పేరుతో రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆర్‌డీఓ కార్యాలయంలోని సెక్షన్ సూపరింటెండెంట్ వెంకటస్వామిని సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మహర్షి మాట్లాడుతూ పీఆర్‌సీ కమిటీ వేసి, మధ్యంతర భృతిని వెంటనే ప్రకటించాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న డీఏలను విడుదల చేయాలని, సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్నే పునరుద్ధరించాలని కోరారు. కార్యక్రమంలో సంగెం శ్రీను, భాస్కర్‌రెడ్డి, పృథ్వీ, అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్ ఎస్‌ఓ దీప, శ్రీనివాస్, శ్యాంసుందర్, రాజు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

కాశిబుగ్గ: ఆర్థిక ఇబ్బందులకు తాళలేక ఓ యువకుడు రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈఘటన వరంగల్ - చింతలపల్లి రైల్వే స్టేషన్ల మధ్య సోమవారం చోటుచేసుకుంది. వరంగల్ జీఆర్పీ సీఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం నగరంలోని శివనగర్‌కు చెందిన కందుకూరి శివకృష్ణ (28) ఏనుమాముల మార్కెట్ సమీపంలో ఓ పాన్ షాప్ నడుపుతున్నాడు. ఆదాయానికి మించిన అప్పులవడంతో తీవ్ర మనస్థాపానికి గురై రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. డిప్యూటీ ఎస్‌ఎస్ ఫిర్యాదు మేరకు ఎస్సై ఐలయ్య కేసు నమోదు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఎంజీఎంలో వృద్ధుడి మృతి

కాజీపేట: వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో 22 రోజులుగా చికిత్స పొందుతున్న గుర్తు తెలియని వృద్ధుడు సోమవారం మృతి చెందినట్లు ఇన్‌స్పెక్టర్ సార్ల రాజు తెలిపారు. సీఐ కథనం ప్రకారం సుమారు 65 ఏళ్ల వయసున్న వృద్ధుడు జంక్షన్ సమీపంలోని రహదారిపై స్పృహ తప్పి పడిపోయి ఉండగా, రైల్వే అధికారులు గుర్తించి ఎంజీఎం ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందాడు. సోమిడి వీఆర్‌ఏ సుంచు నర్సయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు తెలిపారు. వివరాలకు 87126 85122 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

అర్హులకు 'దళిత బంధు' వర్తింపజేయాలి



ధర్నా చేస్తున్న డీహెచ్‌పీఎస్ నాయకులు

హన్మకొండ అర్బన్: రాజకీయ జోక్యం లేకుండా అర్హులైన ప్రతీ దళితుడికి దళిత బంధు పథకం వర్తింపజేయాలని దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్ డిమాండ్ చేశారు. ఈమేరకు డీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా ప్రవేశపెట్టిన దళిత బంధు పథకం అమలు చేయడంలో చిత్తశుద్ధి ప్రదర్శించడం లేదని విమర్శించారు. అంగ బలం, ఆర్థిక బలం ఉన్న ఎమ్మెల్యేల అనుచర వర్గాలకే దళిత బంధు దక్కుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేలతో కాకుండా అధికారులతో లబ్ధిదారుల ఎంపిక జరిపితే కాస్త న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గృహలక్ష్మి పథకం ద్వారా ప్రతి నియోజవర్గానికి 3వేల ఇళ్లను మాత్రమే కేటాయిస్తామనడం దళితులకు అన్యాయం చేయడం, సంక్షేమ పథకాల్లో కోత పెట్టడమేనని వాపోయారు. ఎస్సీ సబ్ ప్లాన్ నిధులను దారి మళ్లించి దళితులను ప్రభుత్వం మోసం చేస్తోందని ఎద్దేవాచేశారు. పేదలందరికీ 58, 59 జీఓ నంబర్ల ప్రకారం పట్టాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ వరంగల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సంగి ఎలేందర్, జన్ను రవి, హనుమకొండ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నిమ్మల మనోహర్, రెంటాల దేవ, నాయకులు రాజారపు రత్నం, రాచర్ల రాజేందర్, ఓరుగంటి శ్రీనివాస్, బత్తుల సుప్రియ, జన్ను రాజు, మహేష్, విజయ్, శంకర్, కొట్టెపాక రవి, బైరపాక అనిత, గట్టయ్య, శిరీష, భిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలి

హన్మకొండ అర్బన్: జిల్లా కేంద్రంలోని మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్ డిమాండ్ చేశారు. ఈమేరకు ఎంజేపీ గురుకులాల ఆర్‌సీఓ మనోహర్‌రెడ్డిని సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు.



వినతిపత్రం ఇస్తున్న మంద శ్రీకాంత్



సురేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న మనోహర్

గురుకుల ప్రిన్సిపాల్‌పై చర్య తీసుకోవాలి

విద్యారణ్యపురి: విద్యార్థులకు పురుగులతో కూడిన భోజనం పెడుతున్న హనుమకొండ జిల్లా ఆత్మకూరులోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల ప్రిన్సిపాల్‌పై చర్య తీసుకోవాలని బీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బొట్ల మనోహర్ డిమాండ్ చేశారు. ఈమేరకు హనుమకొండలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకులాల రీజినల్ కోఆర్డినేటర్ (ఆర్‌సీఓ) కార్యాలయంలో సూపరింటెండెంట్ సురేష్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు.

మత్స్యకారుల కుటుంబాలను ఆదుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న మల్లేశం

హన్మకొండ చౌరస్తా: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు జిల్లా వ్యాప్తంగా ఉన్న చెరువుల్లోని సుమారు రూ.200ల కోట్ల మత్స్య సంపద వరదలో కొట్టుకు పోయిందని, ఈక్రమంలో మత్స్యకారులకు ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని ఉమ్మడి వరంగల్ జిల్లా మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు బుస్సా మల్లేశం కోరారు. హనుమకొండ కాకతీయకాలనీలోని మత్స్య సహకార సంఘం జిల్లా కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 860 మత్స్యకారుల సొసైటీలు, 100 మహిళా సొసైటీల ఆధ్వర్యంలో 36 రిజర్వాయర్లు, 5వేల పైచిలుకు చెరువుల్లో చేపల పెంపకం, అమ్మకాలు సాగుతున్నాయని వివరించారు. చెరువులే ఆధారంగా కుటుంబాలను పోషించుకుంటున్న మత్స్యకారులకు భారీ వర్షాలు నష్టాన్ని మిగిల్చాయని ఆవేదన వ్యక్తం చేశారు. మత్స్యకారుల సమస్యలు పరిష్కరించాలని సూచించారు. సమావేశంలో హనుమకొండ, మడికొండ మత్స్య సొసైటీల అధ్యక్షులు పులి రజనీకాంత్, దువ్వ నవీన్, సంఘం మాజీ డైరెక్టర్ నీరటి సదానందం పాల్గొన్నారు.

భారీ వర్షంతో తీరని నష్టం



చెరువును తలపిస్తున్న పంట పొలాలు

ఖిలా వరంగల్: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఖిలా వరంగల్ మధ్యకోటలోని పంట పొలాలు నీట మునిగాయి. వర్షం తగ్గుముఖం పట్టి నాలుగు రోజులైనా కోటను వరదనీరు వీడటం లేదు. సుమారు 125 ఎకరాల విస్తీర్ణంలోని పంట పొలాలు, ఆకుకూర తోటలు పాడైపోయాయి. అలాగే, మధ్యకోట శిల్పాల ప్రాంగణం సోమవారం వరకూ నీటిలోనే ఉంది. శిల్పాల ప్రాంగణంలో నాలుగు ఫీట్ల మేర నీరు నిలిచి ఉంది. దాంతో చారిత్రక అందాలను వీక్షించేందుకు దూర ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులు నిరాశతో వెనుదిరిగి వెళ్తున్నారు. టీఎస్‌టీడీసీ ఆధ్వర్యంలో నిర్వహించే సౌండ్ అండ్ లైటింగ్ షోకు సంబంధించిన లైట్లు నీటిలో మునిగి ఉన్నాయి.

విద్యుత్‌శాఖ నిర్లక్ష్యంతోనే యువకుడి మృతి



ఆర్థిక సాయం అందిస్తున్న వీహెచ్

హన్మకొండ చౌరస్తా: విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యంతోనే యువకుడు ప్రాణాలు కోల్పోయాడని, బాధిత కుటుంబానికి విద్యుత్‌శాఖ రూ.10 లక్షల నష్టపరిహారం చెల్లించాలని మాజీ రాజ్యసభ సభ్యుడు వీ.హన్మంతరావు డిమాండ్ చేశారు. ఐదు రోజుల క్రితం కురిసిన భారీ వర్షానికి తెగిపడిన విద్యుత్ తీగ తగిలి మృతి చెందిన ప్రేమ్‌సాగర్ కుటుంబాన్ని డీసీసీ అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డితో కలిసి వీహెచ్ సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా పార్టీ తరఫున ప్రేమ్‌సాగర్ కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వరద బాధిత కుటుంబాలకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్పొరేటర్లు వెంకటేశ్వర్లు, శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

హన్మకొండ అర్బన్: గ్రామ పంచాయతీ కార్మిక, సిబ్బంది సమస్యలు వెంటనే పరిష్కరించాలని తెలంగాణ పంచాయతీ కార్మిక, సిబ్బంది జేఏసీ రాష్ట్ర కోశాధికారి, ఉపాధ్యక్షుడు చాతల్ల సదానందం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత కల్పించాలని వివిధ రాజకీయ పార్టీలు, కార్మిక సంఘాల మద్దతుతో జిల్లాలోని జీపీ కార్మికులు, సిబ్బందితో సోమవారం చలో కలెక్టరేట్ కార్యక్రమం నిర్వహించారు. ఆర్ట్స్ కాలేజీ ఆడిటోరియం నుంచి డప్పు చప్పుళ్లతో కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి కలెక్టర్ సిక్తా పట్నాయక్‌కు వినతిపత్రం అందించారు.

అదనపు కలెక్టర్‌కు రేషన్ డీలర్ల సన్మానం

హన్మకొండ అర్బన్: అదనపు కలెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన మహేందర్‌జీని తెలంగాణ రాష్ట్ర రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర, జిల్లా అధ్యక్షుడు బత్తుల రమేష్‌బాబు ఆధ్వర్యంలో జిల్లా రేషన్ డీలర్ల సంఘం నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగాగా కలిశారు. కార్యక్రమంలో రేషన్ డీలర్ల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పోతరాజు రమేష్, బత్తుల మహేష్, ఎదులాపురం వెంకటేశ్వర్లు, జనగాని రాజ్యలక్ష్మి, వర్కింగ్ ప్రెసిడెంట్ సామల మల్లయ్య, సహాయ కార్యదర్శులు మహేశ్వరం గౌరీశంకర్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సై రాజబాబుకు అభినందన

మడికొండ: మడికొండ పోలీస్‌స్టేషన్ ఎస్సైగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన రాజబాబును బీఆర్‌ఎస్ 64వ డివిజన్ గ్రామశాఖ అధ్యక్షుడు వెన్నమల్ల రమేష్, నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. కార్యక్రమంలో మెట్టుగుట్ట డైరెక్టర్ ఓర్సు రాజు, వెంకటస్వామి ఉన్నారు.

మాదిగ భవనం నిర్మించాలని వినతి

కాజీపేట: మాదిగ భవన నిర్మాణానికి స్థలం, నిధులు మంజూరు చేయాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నాయకులు కోరారు. ఈమేరకు కాజీపేట 61వ డివిజన్ ప్రశాంత్‌నగర్ కాలనీలో బీఆర్‌ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్‌ను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఇల్లందుల రాజేష్ ఖన్నా, మేడ స్వామి, దేవరకొండ సదానందం, బచ్చు మొగిలి, సిలువేరు సుధాకర్, జన్ను సంజీవ, తిరుపతి పాల్గొన్నారు.

ఇందిరానగర్‌లో యునాని వైద్య శిబిరం

హన్మకొండ చౌరస్తా: సీజనల్ వ్యాధుల కాలంలో పరిసరాలతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని యునాని ఆస్పత్రి డాక్టర్ ఎస్.మహేంద్రకుమార్ సూచించారు. హనుమకొండ రాయపురలో ప్రభుత్వ యునాని ఆస్పత్రి ఆధ్వర్యంలో 8వ డివిజన్‌లోని ఇందిరానగర్‌లో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో యునాని ఆస్పత్రి సిబ్బంది ఫార్మసిస్టు శంకర్, దేవీ, అశ్రఫ్, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మెట్టుగుట్టపై ప్రత్యేక పూజలు

మడికొండ: మెట్టుగుట్టపై ఉన్న సీతారామచంద్రస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి కే.శేషుభారతి తెలిపారు. మంగళవారం కూడా పూజలు కొనసాగుతాయని వివరించారు. పూజా కార్యక్రమంలో అర్చకులు పరాశరం విష్ణువర్ధనాచార్యులు, రాగిచేడు అభిలాష్ శర్మ, సత్యనారాయణ శర్మ, చైర్మన్ దువ్వ నవీన్, ధర్మకర్తలు చింతకుంట్ల భూపాల్‌రెడ్డి, బుర్ర సంధ్యారాణి, ఓర్సు రాజు, పెద్ది ప్రభాకర్, ఎన్.కుమారస్వామి పాల్గొన్నారు.

నృత్య యోగా కాల స్వరూపంలో మల్లన్న

కాజీపేట: అధిక శ్రావణ మాసోత్సవ వేడుకల్లో భాగంగా కాజీపేట భ్రమరాంబిక మల్లికార్జునస్వామి దేవాలయంలో సోమవారం ప్రత్యేక అలంకరణ పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఐనవోలు ప్రవీణ్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో అర్చకులు స్వామి వారికి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు జరిపించారు. ఇటీవల దాతలు అందించిన వెండి కవచం తొడిగి లక్ష పూలతో స్వామి వారిని అలంకరించారు. పండితుడు శ్రీనివాస్‌శర్మతో పాటు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, శివశక్తి యూత్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌నగర్ కాలనీలో అన్నదానం

కాజీపేట: కాజీపేట 62వ డివిజన్ వైఎస్సార్‌నగర్ కాలనీలోని పేదలకు లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ సభ్యులు సోమవారం అన్నదానం చేశారు. ఇంటర్నేషనల్ డైరెక్టర్ డాక్టర్ జి.బాబురావు జన్మదిన వేడుకలను పురస్కరించుకుని అన్నదానం చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీలత, శ్రీవాణి, కోశాధికారి విజయకుమారి పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

హన్మకొండ: ఇటీవల కురిసిన వర్షాలతో హనుమకొండ వేయి స్తంభాల గుడి ప్రాంతంలో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో మృతిచెందిన ఉట్ల ప్రేమ్‌సాగర్ కుటుంబ సభ్యులను బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, నాయకులు సోమవారం పరామర్శించారు. మృతుడి కుటుంబానికి ప్రభుత్వం, విద్యుత్ సంస్థ ఎక్స్‌గ్రేషియా చెల్లించి ఆదుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు కళ్యాణ్ పాల్గొన్నారు.

43వ డివిజన్ మామునూర్‌లో..

కరీమాబాద్: గ్రేటర్ వరంగల్ పరిధిలోని 43వ డివిజన్ మామునూర్‌కు చెందిన మంద కరుణాకర్, లక్ష్మీపురం గ్రామానికి చెందిన ఎండీ.ఇసాక్‌పాషా అనారోగ్య సమస్యలతో మృతి చెందారు. కాగా, బాధిత కుటుంబ సభ్యులను కార్పొరేటర్ ఈదురు అరుణ సోమవారం పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. విక్టర్, స్పందన, హనుమాన్‌రెడ్డి, సదానందం, రాములు, సారయ్య, వరుణ్, క్రాంతి, అనిల్, శ్రీనివాస్, షకీల్ తదితరులు పాల్గొన్నారు.

64వ డివిజన్ టేకులగూడెంలో..

మడికొండ: గ్రేటర్ వరంగల్ పరిధిలోని 64వ డివిజన్ టేకులగూడెం గ్రామానికి చెందిన మందల జైపాల్‌రెడ్డి సోమవారం మృతి చెందారు. కాగా, బాధిత కుటుంబ సభ్యులను డీసీసీబీ మాజీ చైర్మన్ జంగా రాఘవరెడ్డి పరామర్శించారు. కార్యక్రమంలో రెడ్డి సంఘం కాజీపేట మండల అధ్యక్షుడు జగదీశ్వర్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ నరేందర్‌రెడ్డి, జలందర్‌రెడ్డి, నరోత్తమ్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లోకి రిటైర్డ్ కమాండెంట్

హసన్‌పర్తి: నగరంలోని 43వ డివిజన్ లక్ష్మీపురానికి చెందిన రిటైర్డ్ కమాండెంట్ బరిగెల మోహన్.. బీఆర్‌ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. హనుమకొండ ప్రశాంత్‌నగర్‌లోని తన స్వగృహంలో మోహన్‌కు కండువా కప్పి పార్టీలోకి వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ సోమవారం ఆహ్వానించారు.

పశువులకు నట్టల మందు వేయాలి

ఖిలా వరంగల్: గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు తప్పనిసరిగా వేయించాలని కార్పొరేటర్ వేల్పుగొండ సువర్ణ సూచించారు. ఈమేరకు తూర్పుకోటలోని పశు వైద్యశాల ప్రాంగణంలో డాక్టర్ మాధవి ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మార్కెట్ మాజీ డైరెక్టర్ సంగరబోయిన చందర్, బోగి సురేష్, కర్ణాకర్, రాంబాబు నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

పూర్తి వివరాలు తెలుసుకోవాలి

నయీంనగర్: ఈనెల 27న జరిగిన సంఘటన పూర్తి వివరాలను పోలీసులు తెలుసుకోవాలని బంజారా గిరిజన సమాఖ్య సభ్యుడు సపావట్ మహేందర్ నాయక్ కోరారు. ఈమేరకు హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వరంగల్ జిల్లా సంగెం మండలం అక్కోజి నాయక్ తండాలో తీజ్ పండుగ సందర్భంగా గొడవ జరిగిందని వివరించారు. నిందితులపై చర్య తీసుకోవాలని సూచించారు.

టీచర్లే.. స్వీపర్లు

మండల సర్వసభ్య సమావేశంలో చర్చ



మాట్లాడుతున్న ఎంపీపీ కేతపాక సునీత

హసన్‌పర్తి: ప్రభుత్వ పాఠశాలల్లో స్వీపర్లు లేకపోవడంతో ఉపాధ్యాయులే చీపురు పట్టాల్సి వస్తోందని మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. హసన్‌పర్తి మండల పరిషత్ అధ్యక్షురాలు కేతపాక సునీత అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సోమవారం జరిగింది. విద్యాశాఖపై జరిగిన చర్చ సందర్భంగా సూదన్‌పల్లి సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడారు. పాఠశాలల్లో స్వీపర్లను తొలగించడం వల్ల ఉపాధ్యాయులే ఊడ్చుకోవాల్సి వస్తోందని వాపోయారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా చెరువుల్లో నుంచి లక్షలాది రూపాయల మత్స్య సంపద వరదకు కొట్టుకుపోయిందని నాగారం సర్పంచ్ అరుణకుమార్ అన్నారు. వరదలకు దెబ్బతిన్న ప్రాంతాల్లో కొత్త విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఏఈ గంగమ్మ తెలిపారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు రేనుకుంట్ల సునీత, వైస్ ఎంపీపీ బండా రత్నాకర్‌రెడ్డి, ఎంపీడీఓ రామకృష్ణ, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు వీసం సురేందర్‌రెడ్డి, చకిలం రాజేశ్వర్‌రావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు సీఎం ఇచ్చిన హామీలు నెరవేర్చాలి



పోస్ట్‌కార్డులు ప్రదర్శిస్తున్న నాయకులు

నయీంనగర్: జర్నలిస్టులకు సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలను తక్షణమే నెరవేర్చాలని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టు సంఘం (టీయూడబ్ల్యూజే - ఐజేయూ) నాయకులు డిమాండ్ చేశారు. జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్‌కు పోస్ట్ కార్డుల ద్వారా సోమవారం విన్నవించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గడ్డం రాజిరెడ్డి, తోట సుధాకర్, ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు వేముల నాగరాజు, బొల్లారపు సదయ్య, రాష్ట్ర కార్యదర్శి గాడిపెల్లి మధు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వల్లాల వెంకటరమణ, జిల్లా మాజీ అధ్యక్షుడు శివకుమార్ పాల్గొన్నారు.